
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 11 డిసెంబరు 2024

న్యూస్ బాక్స్

ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో డిసెంబర్ 23నుంచి 25వ తేదీల్లో జరగనున్న ఏబీవీపీ రాష్ట్ర మహాసభల కార్యక్రమ పోస్టర్‌ను పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సిద్ధిపేటలో జరగబోయే రాష్ట్ర మహాసభల్లో విద్యారంగ సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై తీర్మానం చేస్తామన్నారు. విద్యార్థి లోకం ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాధ్యులు సునీల్, రాజు, నిఖిల్, పునీత్, సిద్దార్థ, ఉన్నారు

నేడు గణిత టాలెంట్ టెస్ట్

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన జిల్లా స్థాయిలో గణిత టాలెంట్ టెస్ట్ పరీక్షను జిల్లా కేంద్రంలోని స్థానిక ఎల్.ఎల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వడ్లకొండ శ్రీకాంత్, బాస రాజగోపాల్‌లు తెలిపారు. మండల స్థాయిల్లో ప్రతిభ కనబర్చిన ఆయా పాఠశాలల 200మంది విద్యార్థులతో పాటు, వారిగణిత ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని గమనించాలని కోరారు.

పల్లె పోరుకు సన్నద్ధం

- పోలింగ్ స్టేషన్ల గుర్తింపునకు కసరత్తు
- ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల
- 12వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- 13న అభ్యంతరాల పరిష్కారం
- 17న తుది నోటిఫికేషన్
- మూడు విడతల్లో పోలింగ్



జగిత్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరశంఖాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడైనా పూరించవచ్చుననే సంకేతాలతో జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇప్పటికే ఓటరు జాబితాను గ్రామాలు, వార్డుల వారీగా సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఓవైపు కొత్త ఓటర్ల పేర్లను వార్డుల వారీగా నమోదు చేస్తుండగా, ఇంకోవైపు ఓటరు బ్యాలెట్ పత్రాల ముద్రణకు కసరత్తు మొదలు పెట్టింది. కావాల్సిన పేపర్లను యంత్రాంగం సరఫరా చేస్తుండగా, దానిపై గుర్తులు మాత్రం ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్‌లలో ముద్రించాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

మూడు విడతల్లో పోలింగ్...

జిల్లాలో 382 పంచాయతీల్లోని 3,512 వార్డుల్లో 5,99,487 మంది ఓటర్లు ఉన్నారు. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక్కో విడతలో 6నుంచి 7మండలాల్లో ఎన్నికలను నిర్వహించడానికి పరిశీలన జరుపుతున్నారు. ఇందుకో సం 186 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల (స్టేజ్- 1) వివరాలను ఇప్పటికే సిద్ధం చేశారు వీరే కాకుండా మరో 372 మంది రిటర్నింగ్ అధికారులు (స్టేజ్2) సుమారు 16వేల మంది పీఓలు, ఏపీఓలు, 300మంది రూట్ అధికారులను ఓటర్లు ఉన్న వార్డుల్లో ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. 200 లోపు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు వన్‌ప్లస్‌వన్ చొప్పున పీవోలు, 200 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లలో వన్ ప్లస్ టూ చొప్పున పీవోలు, 400 నుంచి 600 వరకు ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్‌లలో వన్ ప్లస్ త్రి చొప్పున పీవోలను నియమించనున్నారు. పంచాయతీ ఎన్నికలకు మొత్తం మీద 3,512 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తులు..

జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరించి 13వ తేదీన వాటిని పరిష్కరించనున్నారు. 17వ తేదీన పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించనున్నారు.

మిగతా 8లో

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



వెల్గటూర్‌లో 108 వాహనాన్ని జండా ఊపి ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. వెల్గటూర్ మండలానికి నూతనంగా మంజూరైన 108 వాహనాన్ని వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం జిల్లా వైద్య అధికారులు, మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా వెల్గటూర్ మండల ప్రజలు కోరుకుంటున్న 108 అంబులెన్సు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యులు స్వరూప, రీతూరెడ్డి, సీహెచ్‌వో జగన్నాథం, 108 సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి మంజూరి అయిన ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణలక్ష్మి, షాధీముభారఖ్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్దిదారులకు అందజేశారు. ఈ మేరకు 29మందికి కళ్యాణలక్ష్మి, 149మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, ఆర్ఐ తిరుప తి, విండో చైర్మన్ రాంలింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి
- సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

8



పెగడపల్లిలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

- ఎస్ఎస్ఏ జేఏసీ డిమాండ్
- పట్టణంలో ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహానికి వినతి

8



జగిత్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ బాధ్యులు

ప్రజా పాలన పేరుతో రాక్షస పాలన

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం ప్రజా పాలన పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నదని, మహిళలను ఇబ్బంది పెడితే బోనమెత్తిన చేతితో బొంద పెట్టడం ఖాయమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం తమ న్యాయమైన హక్కుల పరిష్కారానికి నిరసన తెలియజేయడానికి హైదరాబాద్ వెళ్తున్న ఆశ కార్యకర్తలను అరెస్ట్ చేయ గా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలకు 18 వేల వేతనం కావాలని శాంతియుతంగా నిరసన తెలియజే యడానికి వెళ్లేవారిని పోలీస్‌స్టేషన్‌లో పెట్టడం సరికాదన్నారు. ఆశా వర్కర్లపై ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించి మహిళ పోలీస్ సిబ్బంది ఉన్నప్పటికీ మగ పో లీసులు బీభత్సం సృష్టించడం కౌరవ పాలనను తలపిస్తున్నదని విమర్శించారు. సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భం గా తెలంగాణ ఆడ బిడ్డలకు ఇచ్చే ఇదేనా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. ఆమె వెంట జగిత్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రియాంక, బీఆర్ఎస్ నాయకులు వొల్లెం మల్లేశం, గంగారెడ్డి, వెంటేశ్వర్లు, ప్రతాప్, హరీష్, ప్రణయ్, సాయిచందు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ

రాయికల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం 14వ, విడత ఉపాధి హామీ పనులపై అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి హామీ పనులపై చెల్లించిన బిల్లులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఎంపీడీవో చిరంజీవి, అంబుడ్స్‌మెన్ క్రిష్ణారెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఏపీవో దివ్య వివిధ గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడలపై నిర్లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విప్ లక్ష్మణ్ కుమార్

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో క్రీడల పట్ల నిర్లక్ష్యం వహించిందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ధర్మపురి మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం ఆయనజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత క్రీడల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఏళ్ల తరబడి నుంచి పీఈటీలుగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను పీడీలుగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఇటీవల మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంపెక్స్, ఐటీఐ కళాశాల భవనానికి త్వరలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భూమి పూజ చేస్తామన్నారు. అంతకు ముందు దమ్మన్నపేట గ్రామంలో గుండు హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. తీగలధర్మారం గ్రామంలో జరిగే గీతా జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆయనకు మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్ ఆహ్వాన పత్రిక అందించారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ కమీష నర్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంఈవో సీతాలక్ష్మి, ఎంపీవో నరేష్‌కుమార్, పాఠశాల హెచ్ఎం పెండ్యాల మహేందర్, కౌన్సిలర్లు, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్యాలక్ష్మణ్, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు పాల్గొన్నారు.

బుగ్గారం : మండల కేంద్రంలో మంజూరైన అంబులెన్స్ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలానికి మంజూరైన 108 అంబులెన్స్‌ను మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా వైద్యాధికారులతో కలిసి ప్రారంభించాడు. అనంతరం స్పోర్ట్స్ అథారటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్‌లో భాగంగా బుగ్గారం మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాల కలశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రీడ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎంపీడీవో శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.


న్యాయ పోరాటంలో గెలిచింది ఆది శ్రీనివాస్

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ చేసిన సుదీర్ఘ న్యాయపోరాటం గెలిపించిందని కోరు ట్ల సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణరావు స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ భారత దేశ పౌరుడు కాదని ఉన్నత న్యాయం స్థానం తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలుపుతూ ఆది శ్రీనివాస్ చేసిన పోరాట స్పూర్తిని న్యాయస్థానం గుర్తించిందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రమేష్ బాబు ప్రభుత్వం నుంచి పొందిన జీతభత్యాలతో పాటు అలవెన్స్‌ల రూపంలో పొందిన డబ్బులు తిరిగి ప్రభుత్వానికి జమ చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్యసాధనలో బ్యాంకర్లు సహకరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ లక్ష్యసాధనలో బ్యాంకర్లు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. మంగళవారం బ్యాంకర్ల త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అర్హులైన అబ్దిదారులకు రుణసౌకర్యం కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని బ్యాంకు రుణ లక్ష్యాలకు సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంకు అధికారులు, ఏజన్సీలతో సామావేశం నిర్వహించి గత సమావేశంలో చర్చించిన అంశాల పట్ల బ్యాంకర్లు, అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల వల్ల వినియోగదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు నిర్వహించి వినియోగదారులను చైతన్య వంతులను చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనే జర్ రాంకుమార్, యూనియన్ బ్యాంక్ ఇండియా డిప్యూటి రిజనల్ హెడ్ ప్రవీన్ గోపాలన్, నాబార్డు డీడీఎం డిలీప్ చంద్ర, ఆర్సీఐ ఎల్‌డీవో సాయితేజరెడ్డి, డీఏవో రాంచంద్రం, ఎస్సీ కార్పొరేషన్ ఈడి కిశోర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- జిల్లా టీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి



నాగేందర్ రెడ్డిని సన్మానిస్తున్న నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ నాయకులు

జగిత్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంక్షే మానికి అవసరమైన కృషిని చేస్తానని జిల్లా టీఎన్‌జీఓ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల పశు సంవర్థక శాఖ కార్యాలయంలో ఇటీవల నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయిన నాగేందర్ రెడ్డిని అధికారులు, ఉద్యోగులు శాలు వలతో సత్కరించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ఎల్ మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేశ్, వెటర్నరీ అసోసియేషన్ నాయకులు కందుకూరి పూర్ణచందర్, గరిగంటి రవి, కోశాధికారి గణేష్, ఏలేటి రవీందర్, ఆనందం, రాజుకుమార్, అశోక్ కుమార్, సంతోష్, శైలజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దివ్యాంగురాలైన కూతురుని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన కన్న కూతురుని హత్య చేసిన నేరంలో నిందితుడైన కసాయి తండ్రికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మానకొండూరు మండలం తీగల గుట్టపల్లికి చెందిన కొమిరె మహేందర్ (38)కి పెళ్లి కాగా కొన్నాళ్లకు ఆమె చనిపోవటంతో చంద్రపురి కాలనీకి చెందిన భావనను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి పాప జన్మించింది. పాప జన్మించిన ఆరు నెలల సమయంలో ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో నరాలు దెబ్బతిని కాళ్లు చేతులు పడిపోయాయి. ఆమెకు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చినా అలాగే ఉంటున్నది. ఏపని చేయక తాగుడుకు అలవాటు పడిన కొమిరె మహేందర్ బిడ్డపై వ్యతిరేకత పెంచుకొని భార్యాబిడ్డలను తరచూ వేధిస్తుండేవాడు. అతని వేధింపులు భరించలేక భావన బిడ్డను ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయింది. ఇదే అదనుగా భావించిన మహేందర్ 2023 మార్చి1న రాత్రి దివ్యాంగురాలైన బిడ్డను హత్య చేసి కెనాల్‌లో పడేశాడు. ఈ సంఘటనపై భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మహేందర్‌పై కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ విజ్ఞాన్‌రావు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను ఎస్ఐ తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి వెంకటేశ్వర్లు విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రతిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 1000 రూపాయల జరిమానా విధించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాల్లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జిల్లా కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన చెదలు రాజేందర్‌ను 2022 జనవరి 13న అదే గ్రామానికి చెందిన కాస సంజీవ్, గోధుర్ గ్రామానికి చెందిన తైదపల్లి రజనీకాంత్ వ్యవసాయ పొలంలో దారి విషయంలో గొడవకు దిగి రాజేందర్‌ను కత్తులతో పొడిచి హత్య చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసిన కాస సంజీవ్ ఏ1, తైదపల్లి రజనీకాంత్ ఏ2, వీరికి సహకరించిన రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మంగళరపు లక్ష్మీనారాయ ణను ఏ3గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసుకు సంబంధించిన సరైన సాక్ష్యాలను పోలీసులు కోర్టులో ప్రవేశ పె ట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా అదనపు జడ్జి మంగ ళవారం తీర్పు వెల్లడించారు. నిందితులు కాస సంజీవ్, రజనీకాంత్ కు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 10 వేల జరిమానా విధించినట్లు తె లిపారు. ఏ3 లక్ష్మీనారాయణకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా అదనపు జడ్జి తీర్పు వెల్లడించారు.

బాలికపై అత్యాచారం

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఓ యువకుడిపై పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని అలమయ్య గుట్టు ప్రాంతానికి చెందిన బాలిక(14)తో పాటు ఆమె తల్లి నివాసం ఉంటున్నారు. సదరు బాలిక తల్లి పలు ఇళ్లలో పని మనిషిగా చేస్తోంది. కూతురు ఇంటి వద్దనే ఉండడంతో కాలనీకి చెందిన యువకుడు ఇప్ప రవి సదరు బాలికతో పరిచయం పెంచుకున్నాడు. కొద్ది రోజులగా బాలికను బెదిరింపులకు పాల్పడుతూ అత్యాచారానికి పాల్పడుతున్నాడు. మంగళవారం విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఇద్దరు కలిసి రవి ఇంటికి వెళ్లి నిలదీయడంతో వారిపై రవి దాడి చేసాడు. దీంతో సదరు మహిళ స్థానికుల సహాయంతో పోలీసు స్టేషన్‌కు చేరుకోని తన కూతరుపై జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. విషయంపై కోరుట్ల సీఐ సురేష్ బాబు ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం బాలికకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. ఈ విషయంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విచారణ జరిపినట్లు సమాచారం.

ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దు



దర్శన టికెట్లను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దని గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మంగళవారం దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆలయాన్ని సందర్శించి దేవాదాయ శాఖలోకి విలీనం చేసుకుని ఈవో కాంతారెడ్డికి బాధ్యతలను అప్పగించారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థు లు అక్కడకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆలయ పరిస రాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎళ్ల నుంచి ఆలయానికి సేవలు చేస్తూ ఆధారిపడిన వారి కుటుంబాలు రోడ్డున పడతాయని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విలీనం ఆపాలని కోరారు. నిర్వాహకులకు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ వారికి తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని వ్యాపారస్థులతో మాట్లాడి టికెట్ చార్జీలను తెలుసుకున్నారు. ఆలయానికి లక్షల్లో ఆదాయం వచ్చినా భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదని రెండేళ్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టి ఆలయాన్ని విలీనం చేసిందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయం వద్ద బందోస్తు ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని ఆమె కోరారు. దేవాదాయశాఖ అధికారులు, పోలీసుసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

శంకరపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలోని నేదురు ఐలమ్మ ఇంటి తాళం పగలగొట్టి రూ. 74వేల నగదు, బంగారు గొలుసులు చోరికి గురైన సంఘటన వెలుగు చూసింది. నేదురు ఐలమ్మ సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి గర్రెపల్లికు వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోనే వస్తువులు చిందరవందర పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లిచూడగా రెండు తులాల బంగారు గొలుసులు, రూ. 74వేల నగదు దొంగలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఓ కుటుంబం ఇంటి తాళం పగలగొట్టి చోరికి పాల్పడ్డారని కేశవపట్నం పోలీసులకు బాధితురాలు ఐలమ్మ ఫిర్యాదు చేసింది.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని కొత్తపల్లి రాజేశ్వరి తన ఇంటికి తాళం వేసి కథలాపూర్ మండలంలోని పోసానిపేట గ్రామానికి వెళ్లింది. మంగళవారం ఉదయంలో ఇంటికి తిరిగి వచ్చిన రాజేశ్వరి తన ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అదే ప్రాంతంలో ఉన్న నల్ల లక్ష్మణ్ ఇంటి తలుపులకు ఉన్న తాళం పగుల గొట్టి ఉండగా గమనించిన స్థానికులు లక్ష్మణ్‌కు సమాచారం అందించారు. లక్ష్మణ్ మూడునెలల నుంచి మెట్‌పల్లి పట్టణంలోని ఉంటున్నాడు. కొత్తపల్లి రాజేశ్వరి ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు ఐదువేల నగదు ఆపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మణ్ ఇంట్లో ఎంతపోయిందో రాత్రి వరకు నిర్ధారణ కాలేదు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ ద్వారా వేలిముద్రలను నమోదు చేసి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్ ఇలా.. టెస్ట్ ఎలా..?



డ్రైవింగ్ టెస్టు ట్రాక్ కనిపించకుండా ఇరువైపుల పెరిగిన చెట్లు

- అసంపూర్తిగా డ్రైవింగ్ టెస్టు ట్రాక్
- 2015 ప్రారంభమైనా పూర్తికాని పనులు
- ట్రాక్ లేక నామమాత్రంగా డ్రైవింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీ కార్యాలయంతో పాటు జిల్లా రవాణా శాఖ కార్యాల యం ఉన్నది. ఇందులో 5 ఎకరాల విస్తీర్ణంలో 2015వ సంవత్సరంలో డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారం భించారు. కొంత పనులు పూర్తయినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ట్రాక్‌కు ఇరువైపులా పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది.



ముళ్లతో చిత్తడిగా ఉన్న ట్రాక్

డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు

డ్రైవింగ్ టెస్టులో ఉత్తీర్ణత కావాలంటే ముందుగా వాహనం నడిపే వ్యక్తికి రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి. రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఉంటాయి. అలాంటి సమయాల్లో ఏ విధంగా వాహనం నడపాలనేది ప్రతి వాహనదారుడు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఇందుకోసం డ్రైవింగ్ టెస్టుకు రకరకాల ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. కారు, ద్విచక్ర, భారీ వాహనాలు నడిపే వారికి వేరువేరుగా ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. 8 ట్రాక్ బాగా మలుపులు ఉన్న రోడ్లపై ఎలా ముందు వెళుతున్నామో తెలుస్తుంది. హెచ్‌ట్రాక్ ద్వారా వాహనం ముందుకు వెళ్లిన తరువాత రివర్స్ చేయాల్సి వచ్చినప్పుడు ఎలా తీసుకుంటున్నారో తెలుస్తుంది. ఎస్ ట్రాక్ ఒక మూల నుంచి మరో మూలకు మలుపు కోవాల్సి వచ్చినప్పుడు ట్రాక్ ద్వారా వాహనం నడిపే వారి నైపుణ్యం తెలిసిపోతుంది. ఎత్తుపల్లాల ట్రాక్ ద్వారా లోయలు, ఎత్తు పల్లాలు వంటి ప్రాంతాల్లో వాహనం ఎలా నడుపుతారో పరిశీలిస్తారు.

అమలు కాని నిబంధనలు :

మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో నిర్దీత ప్రమాణా ల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వారికి రవాణాశాఖ అధికారులు పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్స్ మంజూరు చేస్తారు. ప్రస్తుతం డ్రైవింగ్ టెస్టు ట్రాక్ అందుబాటు లోకి రాకపోవడంతో నామమాత్రంగానే కార్యాలయం సమీపంలోనే ఖాళీ స్థలంలో బండ రాళ్లను ఏర్పాటు చేసి



బండరాళ్లను ఏర్పాటు చేసి టెస్టు చేయిస్తున్న అధికారులు

డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం టెస్టులు నిర్వహించక పోవడంతో డ్రైవింగ్ సరిగా రాకున్నా లైసెన్స్ ఇవ్వాల్సి వస్తుందనే విమర్శ లు ఉన్నాయి. ట్రాక్ వద్ద చెట్ల పొదలతో చిత్తడిగా మారింది. అధికారులు స్పందించి ట్రాక్ చుట్టూ ఉన్న చెట్ల పొదలు తొలగించి డ్రైవింగ్ టెస్టు ట్రాక్ పనులు పూర్తి చేయాలని వాహన దారులు కోతున్నారు.



ఎత్తు పల్లాల ట్రాక్ వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

డ్రైవింగ్ టెస్టులకు త్వరలో కొత్త టెక్నాలజీ

డీటీసీ పురుషోత్తం



ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం తెలిపింది. అప్పటి వరకు పాత పద్ధతిలోనే డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తాం. ఆటో మెటిక్ టెస్టింగ్ సెంటర్లు ఎప్పుడు వచ్చేది పూర్తిగా తెలియదు. డ్రైవింగ్ టెస్టు ట్రాక్ నిర్మాణం ఎందుకు ఆగిపోయిందో తెలియదు. ప్రస్తుతానికి సీనియర్ ఇన్స్‌పెక్టర్ల పర్యవేక్షణలో డ్రైవింగ్ టెస్టులు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

జాతీయ బయోకెమిస్ట్రీ సదస్సులో సిమ్స్ విద్యార్థుల ప్రతిభ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) విద్యార్థుల పరిశోధన, నైపుణ్యంతో జాతీయ బయోకెమిస్ట్రీ సదస్సులో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 4 నుంచి 7వరకు చండీఘర్‌లో జరిగే 50వ జాతీయ బయో కెమిస్ట్రి సదస్సు ఏసీబీ ఐకాన్-2024 నుంచి గోదావరిఖని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చెందిన ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. సాధారణంగా ఎండీ, పీహెచ్‌డీ స్థాయి విద్యార్థులు చేసే పరిశోధన ప్రదర్శనకు దీటుగా సిమ్స్ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు ప్రదర్శన చేయడంపై ఐఎఫ్‌సీసీ అధ్యక్షుడు, ఏసీబీ ఐకాన్-2024 అధ్యక్షుడు డాక్టర్ ఇందు వర్మ ప్రత్యేకంగా అభినందించారు. బయోకెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ సారథ్యం లో పరిశోధన చేశారు. ఈ పరిశోధను జాతీయ సదస్సులో ప్రదర్శించారు. సాత్విక్, తిరూశి, అభిరామ్ రెడ్ టాక్సిసిటీ నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలపై బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోకవర్ధన్ సహకారంతో పరిశోధన ప్రదర్శన నిర్వహించారు. సృజన, హర్షవర్ధన్, సందీప్ విటమిన్-డీ, శ్వాసకోశ సం బంధిత సమస్యలు, దాని ప్రభావం అంశంపై ప్రదర్శన నిర్వహించారు. అలాగే సాల్వాజీ రిషిరావు, గోషిక అన్ను న్యూరో బయో కెమిస్ట్రీలో మెదడు, జ్ఞాపకశక్తి అంశంపై ప్రదర్శన నిర్వహించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, వైస్‌ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రీ విభాగ అధిపతి డాక్టర్ నరేందర్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు

మద్యం మత్తులో ఆర్టీసీ బస్‌పై దాడి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన ప్రయాణికుడు ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్‌లో ఓడేడు వెళ్తున్న టీఎస్02 యూఏ 9885 బస్సులో కరీంనగర్‌కు చెందిన పంపరి శివకుమార్ ఎక్కాడు. తోటి ప్రయాణికులతో గొడవకు దిగిన శివకుమార్ కాలనీ షిర్కే బస్‌స్టాప్ వద్ద నడుస్తున్న బస్ నుంచి దూకాడు. రాళ్లతో బస్ అద్దాలను ధ్వంసం చేశాడు. దాడి ఘటనపై డ్రైవర్ బొడ్డు కుమార్ గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) స్థానిక చందపల్లికి చెందిన గజరంగి పోశెట్టి తన భార్య పిల్లలతో బైక్‌పై ఈనెల 4న బందంపల్లికి వెళుతుడగా హ్యాండ్ బ్యాగ్ పడిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో తులం చెవికమ్మలు, మాటీలు ఉన్నయని ఎస్సై లక్ష్మణ్‌రావుకు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై విచారిస్తుండగా శాంతినగర్ పెట్రోల్ బంక్ దగ్గర్లో పంక్చర్ షాప్ నడుపుకునే ఎండీ అఫ్జల్ తనకు హ్యాండ్ బ్యాగ్ దొరికిందని పోలీసులకు అప్పగించాడు. పెద్దపల్లి ఏసీపీ సమక్షంలో బ్యాగ్‌లో ఆభరణాలతో బాధితులకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న అఫ్జల్‌ను ఏసీపీ కృష్ణ మంగళవారం సన్మానించారు.

23క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులోని బెండ బుడగజంగ కాలనిలో గల ఓ డేరాలో అక్రమంగా నిల్వ ఉంచిన 23.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని మార్కండేయ కాలనీకి చెందిన చింతల రామస్వామి అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీస్‌లు గుర్తించారు. ఈ మేరకు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

తండ్రి, కూతురు అరెస్టు

చందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలో తండ్రితోపాటు కూతురును అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జాగిరి నర్సయ్య తనకు చెందిన ఇల్లును అతనికి తెలియకుండానే తన అన్న అయినా జాగిరి పర్శరాములు, కూతురు జాగిరి మానస, నేరెళ్ల రమేష్ కలిసి మానస పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా జాగిరి పర్శరాములు, జాగిరి మానసలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించాగా, నేరెళ్ల రమేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణిలో మహిళా అధికారులు

- ఇప్పటి వరకు ఉద్యోగులుగానే పరిగణింపు
- ఇక నుంచి మైనింగ్‌లోనూ నియామకం
- మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)లుగా విధుల్లో చేరిక



నేటి ఆధునిక సమాజంలో మహిళ ఒక పైలట్‌గా, అంతరిక్ష వ్యోమగామిగా, డాక్టర్‌గా, పోలీసుగా, రాజకీయ నాయకురాలిగా ఇలా అన్ని రంగాల్లో రాణిస్తోంది. మహిళలు మగవారికి దీటుగా 'సరిలేరు స్త్రీకెవ్వరు' అన్నట్లుగా దూసుకెళుతున్నారు. అందుకే సింగరేణి సంస్థ పురుషులకే పరిమితమనుకున్న మైనింగ్ రంగంలో అవకాశం ఉన్న చోట మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది.

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నవశకం మొదలైంది. ఇప్పటి వరకు యాజమాన్యం మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పించగా ఇక నుంచి మహిళా అధికారులు(మేనేజ్‌మెంట్ ట్రైనీ-మైనింగ్) సంస్థలో పనిచే సేందుకు అంతా సిద్ధమైంది. శ్రీరాంపూర్ ఏరియాకు 22 మంది ఎంటీ(మైనింగ్) అధికారులను కేటాయించగా, ఇందులో ముగ్గురు మహిళా అధికారులు ఉన్నారు. వారు సోమవారం విధుల్లో చేరారు.



మేనేజ్‌మెంట్ ట్రైనీ మైనింగ్ మహిళా అధికారులు

బ్రిటీష్ నాటి కాలంలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సింగరేణి గ్రామంలో (ప్రస్తుతం ఇల్లెందు) 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పట్లో గునపాలతో బొగ్గును తొలిచి పైకి తీసుకొచ్చేవారు. బొగ్గు ఉత్పత్తిలో మహిళలు, బాలబాలికలు పాలుపంచుకునేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947లో మహిళలను భూగర్భంలో పనిచేయకుండా నిషేదం విధిస్తూ అప్పటి భారత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఆ తరువాత అవసరాలకు అనుగుణంగా మహిళలు సైతం గనుల్లో దిగి పనులు చేయవచ్చని గత చట్టాన్ని సవరించారు. దీంతో వారికి అవకాశాలు ఏర్పడ్డాయి.

నేరుగా ఉద్యోగావకాశం..

ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం ఈ ఏడాది మే నెలలో సింగరేణి నోటిఫికేషన్ ఇచ్చింది. పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్)గా 88 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 28 మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొత్తగూడెం ఏరియాలో ఆరుగు రు, భూపాలపల్లి ఏరియాలో ఆరు గురు, ఆర్‌జీ-2 ఏరియాలో ఆరుగురు, ఆర్‌జీ-1 ఏరియాలో ఐదుగురు, శ్రీరాంపూర్ ఏరియాలో ముగ్గురు, మణుగూరు ఏరియాలో ఇద్దరు సోమవారం జాయిన్ అయ్యారు.

ఏడాది శిక్షణలోనే...

ఉద్యోగంలో చేరిన వారికి రెండు వారాల పాటు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ఉంటుంది. మొదటి మూడు రోజులు రక్షణపై స్థానిక వృత్తి శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తారు. దీంతో కలుపుకొని రెండు వారాల పాటు వివిధ విభాగాలపై అవగాహన, మరో రెండు వారాలు పని ప్రదేశాల్లో శిక్షణ ఉంటుంది. నూతన ట్రైనీలు నెలకోమారు తమ శిక్షణకు సంబంధించిన రిపోర్టును వీటీసీలలో సమర్పించాలి. ఆరు నెలలకు ఫేజ్-1, ఒక సంవత్సరానికి ఫేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తదుపరి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తారు.

సింగరేణిలో మహిళలకు గతంలో నేరుగా ఉద్యోగాలిచ్చే అవకాశం లేదు. కేవలం వారి కుటుంబ పెద్ద చనిపోతే ఉద్యోగం ఇచ్చేవారు. ఆ తరువాత 2018 నుంచి కారుణ్య విధానంలో నియామకాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు కంపెనీ వ్యాప్తంగా సుమారు 1530 మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. కాగా కారుణ్య

గతంలో కుటుంబ పెద్ద చనిపోతే..

నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం పొందిన మహిళలు కార్యాలయాలు, విభాగాల్లో వివిధ పనులు చేస్తున్నారు. కానీ గనుల్లోకి దిగడం లేదు. గతేడాది జూన్ 24న అప్పటి వరకు ఉన్న సర్ఫేస్ పదం తొలగించి అండర్ గ్రౌండ్ అని సర్క్యులర్ జారీ చేయడంతో మహిళా ఉద్యోగులు అండర్‌గ్రౌండ్‌లోకి దిగక తప్పదా అని చర్చ జరిగింది. ఆ తరువాత ఆ విషయం మరుగున పడింది.

శిక్షణ పొందిన తరువాతే విధులు

కల్లూరి వెంకట రామారావు, మేనేజర్, శ్రీరాంపూర్ వీటీసీ



సింగరేణిలో ఎవరు నియామకమైనా ముందుగా వృత్తి శిక్షణ కేంద్రం (వీటీసీ) ద్వారా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇక్కడ బొగ్గు గనులు, వృత్తి సంబంధిత పనులు, విధులు, నిబంధనలు, నియమాలు, రక్షణ, తదితర విషయాలపై థియరీ నేర్చుకుంటారు. అనంతరం వృత్తి సంబంధిత పనులను గనుల్లోకి వెళ్లి తెలుసుకుంటారు. నూతనంగా మైనింగ్ అధికారుల బ్యాచ్ రావడం అభినందనీయం.

కష్టాలు ఎదుర్కొని..



ఈమె పేరు మాడిశెట్టి సాయిప్రత్యూష. జగిత్యాల జిల్లా డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామం. తండ్రి టైలర్‌గా పనిచేసేవాడు. సాయిప్రత్యూషకు నాలుగేళ్ల వయస్సున్నపుడే తండ్రి చనిపోయాడు. తల్లి రేణుక టైలరింగ్ పనిచేస్తూ ఆమెతో పాటు చెల్లెలు ప్రియాంకను చదివించింది. నాచుపల్లిలో పాఠశాల విద్యాభ్యాసం, కరీంనగర్‌లో ఇంటర్మీడియెట్, కొత్తగూడెంలో బీటెక్(మైనింగ్) చేసింది. ఆ తరువాత రాజస్థాన్‌లో శిక్షణ పొందింది. ఇటీవల సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగం సాధించింది.

మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం..



ఈమె పుట్టపాక సుమ. జగిత్యాలవాసి. తండ్రి తిరుపతి కారు డ్రైవర్. తల్లి భాగ్యలక్ష్మి బీడీ కార్మికురాలు. సుమకు ఒక తమ్ముడు ఉన్నాడు. బీటెక్ చదువుతున్నాడు. జగిత్యాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, ఇంటర్ పూర్తి చేసింది. అనంతరం జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ చదివింది. చదువు పూర్తికాగానే పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) గా ఉద్యోగం సాధించింది.

ఉన్నత విద్యావంతురాలు



పాపునూక లక్ష్మి సైతం జగిత్యాలవాసే. తండ్రి బుచ్చన్న స్థానికంగా ప్రైవేటుగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. ఇంకా ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. లక్ష్మి ఎస్ఎస్‌సీ, ఇంటర్ జగిత్యాలలో చదువగా, మంథని జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసింది. అనంతరం చెన్నై నుంచి ఎంబీఏ చదివింది. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)గా ఉద్యోగం పొందింది.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ జిల్లా కేంద్రంలోని అకస్మిక తనిఖీలను నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలోని స్కానింగ్ మిషన్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్ మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనాల ప్రకారం గర్భస్థ పూర్వ పిండ స్కానింగ్ పరీక్షలను నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం స్కానింగ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఎన్జీవో చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాష్ శుక్ల పాల్గొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు.. తప్పించుకునే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వాహన తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి తన బైక్‌పై అతి వేగంగా వెళుతూ మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో మండల కేంద్రంలోని వ్యక్తి చరణ్‌తో పాటు మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో చరణ్ పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన చరణ్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్నాడు. వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయంతో బైక్‌ను వెనక్కి తిప్పి అతి వేగంగా ముందుకు దూసుకెళ్లి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో చరణ్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. చరణ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రోడ్డ పక్క నుంచి ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం వల్ల తప్పించుకునే ప్రయత్నంలోనే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు.

కొండగట్టులో భక్తుల సందడి


కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, డిశంబరు 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయయ స్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాఢబూసి శ్రీధర్ కుటుంబ సమేతంగా అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత మూర్తి కూడా అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్ర శేఖర్‌తో పాటు వెల్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, నూకపల్లి విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, హరిచరణ్‌రావు, సంపత్‌కుమార్ ఉన్నారు

● సమాచారం పొందడం పౌరుల హక్కు

ప్రభుత్వ కార్యాలయాలు తదితర సంస్థల నుంచి సమాచారం పొందడం ప్రతీ ఒక్కరి హక్కు అని సమాచార హక్కుచట్టం కమిషన్ మాజీ కమిషనర్ మాఢబూసి శ్రీధర్ తెలిపారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ ప్రజలు దేనినైనా తెలుసుకోవచ్చునని అందించడం సంస్థలు, కార్యాలయాల బాధ్యత అని తెలిపారు.


రూపు కోల్పోయిన పూలవనం


గదికి అడ్డంగా ఏర్పాటు చేసిన ఇసుక సంచులు

అశోక వనం

- కొండగట్టు అంజన్న పూలవనంపై శీతకన్ను
- ఎండిపోయిన మొక్కలు
- గుట్టల వరదనీటితో ఉనికి కోల్పోయిన పూలవనం

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలోని అశోక వనంపై అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉనికి కోల్పోతోంది. అందులోని పూలు, పండ్ల మొక్కలు, చెట్లు ఎండిపోయాయి. గతంలో నిత్యం ఇక్కడి నుంచే స్వామి పూజలకు ఆలయ అలంకారానికి పూలు, పండ్లు, మామిడి ఆకులు తీసుకు వచ్చేవారు.

కొండపై నుంచి జేఎన్‌టీయూ వెళ్లే మార్గంలో బొజ్జపోతన గుడి సమీపంలో గల స్వామి వారి రెండెకరాల భూమిలో నిత్య పూజలకోసం పదేళ్ల క్రితం అశోకవనం పేరిట పూలు, పండ్లతోటలను పెంచడం ప్రారంభించారు. ఇందులో దాదాపు 500వరకు మామిడి, దానిమ్మ, జామ, ఎలక్కాయ, ఉసిరితో పాటు గులాబి, తులసి తదితర అనేక మొక్కలను పెంచారు. వాటి పర్యవేక్షణకు దేవస్థానం సిబ్బంది ఒకరిని నియమించారు.

గత హరిత హారం కార్యక్రమంలో భాగంగా మరిన్ని మొక్కలు కూడా నాటారు. అయితే కొన్నాళ్లుగా దానిపై నిర్లక్ష్యం కొట్టొస్తోంది. పూలు,పండ్ల తోటలలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ వాటి సంరక్షణ, పెంపునకు దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా దాన్ని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దేవస్థానం పారి శుధ్య సిబ్బందిచే కొన్నాళ్ల క్రితం వరకు అశోక వనంలో కలుపు తీయడం, మొక్కల సంరక్షణ చేసేవారు.

చర్యలు తీసుకుంటాం..: రామకృష్ణరావు, ఈవో

అశోకవనం సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. మరిన్ని వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు కూడా నాటిస్తాం. మొక్కల పెంపుకు చేపడుతాం. పూలు ఆలయానికి వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటూ తరచూ పర్యవేక్షణకు అధికారులకు బాధ్యతలు అప్పగిస్తాం. పూలవనంను అద్భుతంగా తీర్చిదిద్దుతాం.

గుట్టల వరదతో కనుమరుగు

వర్షాకాలంలో కురిసిన వర్షాలకు గుట్టల నుంచి వచ్చిన వరదకు పూలవనం ఇసుక దిబ్బలతో నిండి రూపు కోల్పోయింది. సమీపం గుట్టల నుంచి వచ్చే నీరు వెళ్లడానికి గతంలో కాంటూరు కందకాలు, వాటి ముందు కాలువలు ఉండగా ఇటీవల కందకాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేశారు. దీంతో కాలువ కనుమరుగు అయిగుట్టల నీరంతా పల్లపు ప్రాంతంలో ఉన్న పూలవనంలోకి వరద వస్తోంది. దీంతో అక్కడ గల పూలవనం కొట్టుకు పోగా గదికి అడ్డంగా ఇసుక సంచులు వేశారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని తరచూ పర్యవేక్షిస్తూ అశోకవనం మరింత పెంపొందించాల్సిన అవసరం ఉంది.


డ్రిప్ పరికరాల వద్ద బయట నుంచి వస్తున్న నీరు

అంతరాష్ట్ర దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన కాలనీలో దొంగతనం కేసులో అంత రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు(50)ని మంగళవారం బైపాస్ రోడ్‌లోని గౌతమినగర్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కరీంనగర్ ఒకటవ ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నవంబరు 23న శాతవాహన కాలనీలోని ఉప్పుగుండ్ల మురళీకృష్ణకు చెందిన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టామన్నారు. మంగళవారం గౌతమినగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా సత్యనారాయణ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జడ్జి ఆదేశాలతో సత్యనారాయణను రిమాండ్‌కు తరలించాలని తెలిపారు. నిందితుడిపై గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు నమోదయ్యాయని, శిక్ష కూడా అనుభవించాడనిసీఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకులు ఎం.నాగలేశ్వర్ తెలిపారు. పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం ఎస్సీ రెన్యూవల్, ఫ్రెష్ విద్యార్థులు కళాశాలలు తమ దరఖాస్తులను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ విద్యార్థులతో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా శ్రద్ధ వహించాలని కోరారు.

గీతాజయంతి ఉత్సవాలు ప్రారంభం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలను ఆలయ స్థానాచార్యులు అప్పాల బీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం గీత జయంతి ఉత్సవాలను పురష్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి అద్దాల మండపంలో స్వస్తి పుణ్య హవచనం, మంటప ప్రవేశం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలను వేదమంత్రాలతో చేపట్టారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు గీతా హోమం ఘనంగా నిర్వహించారు. సంస్కృత పాఠశాల విద్యార్థులతో భగవద్గీత పఠనం చేయించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయ అద్దాల మండపంలో శ్రీమద్భాగవతము దశమస్కంద పురాణ ప్రవచనము చేశారు.

రాజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ అలం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయి

జాతీయ సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్


మాట్లాడుతున్న మాఢబూసి శ్రీధర్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) మనిషి పుట్టుకతోనే హక్కులు సంక్రమిస్తాయని అవి ఎవరో ఇచ్చేవి కావని జాతీయ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జతీయ మానవ హక్కుల సమాఖ్య జగిత్యాల ఆధ్వర్యంలో జగిత్యాలలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాడభూషి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగే హక్కు, ఆలోచించే హక్కు జీవించే హక్కు ఇవన్నీ ఎవరి ద్వారానో రాలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం ద్వారా మనకు మరిన్ని హక్కులు సంక్రమించాయన్నారు.కార్యక్రమంలో తెలంగాణ మానవ హక్కుల సమాఖ్య ఫౌండర్, చైర్మన్ అయిల్నేని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నక్క గంగారాం, ఉపాధ్యక్షులు సందీప్‌రావు, ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రతినిధి ప్రశాంత్‌రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్ప చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై రెండు రోజులుగా గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్నారు. ప్రతి నిత్యం ఇసుకను అక్రమంగా తరలించడమే కాకుండా ఓవర్ లోడ్‌తో వెళ్లడంతో రోడ్లు అవుతున్నాయని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రెండు రోజులుగా పచ్చునూర్, ఊటూర్ గ్రామస్థులు, మండల కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టి లారీలను అడ్డుకున్నారు. ఊటూర్ క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఓవర్ లోడ్‌తో ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఇసకలారీలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మానకొండూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మద్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బందెల మహేందర్, మండల యూత్ అధ్యక్షులు కోండ్ర సురేష్, ఎర్రోల్ల కవిత, కనకం అశోక్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ఊటూర్-పచ్చునూర్ గ్రామాల మధ్య నిలిచిన ఇసుక లారీలు

క్రీడలతో మానసికోల్లాసం

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. బాలుర విభాగంలో కరీంనగర్ 1వ స్థానం, మహబూబ్ నగర్ 2వ స్థానం, ఖమ్మం 3వ స్థానం, బాలి కల విభాగంలో ఖమ్మం 1వ స్థానం, కరీంనగర్ 2వ స్థానం, హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచాయి.


గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

న్యాక్ బృందం గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సందర్శన


న్యాక్ బృందంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం మంగళవారం సందర్శించింది. బృందం సభ్యులు రెండు రోజుల పాటు కళాశాలలోని వివిధ విషయాలపై అధ్యయనం చేసినట్లు ప్రిన్సిపల్ రెహానా ఇఫత్ తెలిపారు. కళాశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన పద్ధతులు, అవలంభిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయని అధ్యయనం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడ్ కేటాయించేందుకు నివేదికను షీల్డ్ కవర్‌లో బెంగళూరులోని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయానికి పంపించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐక్య, కోఆర్డినేటర్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అబద్ధపు హామీలతో విసిగిపోయిన ప్రజలు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్


బైక్ ర్యాలీ తీస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు, 66 మోసాలు పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రదీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిగా నిర్వహిస్తున్న పాలనను ప్రజల ముందు ఎండగట్టేందుకు బీజేపీ ఉద్యమి స్తోందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అని స్పష్టం చేశారు. సమావేశంలో గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, కాసిపేట శివాజీ, లావణ్య, ఊశ్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, తంగేడ రాజేశ్వర్‌రావు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమలో నాయకులు కూకట్ల నాగరాజు, గోమాస శ్రీనివాస్, గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి, సోమారపు లావణ్య, సంధ్యారాణి, ఎస్ఎస్‌సీ వనజ, అశోక్‌రావు, రాజన్నపటేల్, కందునూరి కుమార్, పవన్, కుమార్‌రెడ్డి, వేగోళం శ్రీనివాస్, సదయ్య పాల్గొన్నారు.

రామగుండంలో మొదలైన ‘ఇందిరమ్మ’ సర్వే

- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికకు పకడ్బందీ వెరిఫికేషన్
- జీపీఎస్ ఫొటోలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పరిశీలన


ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక వెరిఫికేషన్ నిర్వహిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసేందుకు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌ను ఈ సర్వేలో ఉపయోగిస్తున్నారు. పేదల్లో నిరుపేదలకు మొదటి దశలో ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే ఇందిరమ్మ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసి ఉంచారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి సర్వే చేస్తున్నారు. ఇందిరమ్మ యాప్‌లో వివరాల ఆధారంగా వెరిఫికేషన్ చేస్తున్నారు. యాప్‌లో పలు అంశాలను కీలకంగా పెట్టారు. ముఖ్యంగా గతంలో ఇందిరమ్మ లబ్ధిదారులు, రేషన్‌కార్డులు, దరఖాస్తుదారులకు స్థలం ఉందా అనే విషయాలను ఆరా తీస్తున్నారు.

ఫొటోలు అప్‌లోడ్..

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి వెరిఫికేషన్‌లో ఈ సారి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా యాప్‌లో ప్రస్తుతం నివాసముంటున్న ఇల్లు సొంతమ, అద్దెనా, ఏ రకమైన కట్టడం అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

ఇంటిబయట, పైకప్పు, లోపల జీపీఎస్‌తో అనుసంధానం చేసి ఫొటోలు తీస్తున్నారు. ఇల్లు రేకుల ఇల్లా, స్లాబా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఇంటి స్థలం ఉంటే డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తున్నారు. డాక్యుమెంట్లకు సంబంధించే 12రకాల ఆప్షన్లు ఇచ్చారు. సొంత స్థలం, ప్రభుత్వ స్థలం, ప్రభుత్వం నుంచి పట్టా తీసు కున్న స్థలం,రెగ్యులరైజ్ అయిన స్థలం, అసైన్డ్, గ్రామ కంఠం తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. స్థలానికి సంబంధించి సేల్‌డీడ్‌లు, ఇతర వివరాలు తీసుకుంటున్నారు. ఒకవేళ నివాసముంటున్న ప్రాంతానికి స్థలం దగ్గరలోనే ఉంటే ఆ స్థలం వద్ద దర ఖాస్తుదారుల ఫొటోతో పాటు రేఖాంశాల వివరాలను పొందుపరుస్తున్నారు.

పాత లబ్ధిదారులకు నో ఛాన్స్..

ఇందిరమ్మ పథకంలో గతంలో లబ్ధిదారులుగా ఉన్న వారికి అవకాశం ఇవ్వరు. దీంతో పాటు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు, పక్కా ఇండ్లు, ఖరీదైన స్థలాలు ఉన్న వారు, ఫోర్‌వీలర్స్ యజమానులకు అవకాశం ఉండదు. ఈ పథకం క్రింద అర్హులను గుర్తించి ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్య తనిస్తారు.

మూడు విడతల్లో నిధులు..

ఇందిరమ్మ పథకానికి అర్హులైన పేదలకు మొదటి దశలో నియోజకవర్గానికి 3500 మంజూరు చేస్తారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి మూడు విడుతల్లో రూ.5లక్షల చొప్పున నిధులు ఇస్తారు. నిర్మాణానికి సంబంధించి జీపీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌తో ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇందిరమ్మ పథకం అర్హుల ఎంపికకు సర్వే మొదలైంది. నగర పాలక సంస్థ పరిధిలో 50డివిజన్లు ఉండగా ఆయా డివిజన్ల బిల్ కలెక్టర్లు, సహాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ఆధారంగా ఈ సర్వే చేస్తున్నారు. రామగుండం అర్బన్‌లో మొదటి రోజు జరిగిన సర్వేలో ఎక్కువ వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నట్లు తెలుస్తుంది. కాగా 20ఏళ్ల క్రితం సింగరేణిలో గోల్డెన్ షేక్ హ్యాండ్, వీఆర్ఎస్‌లతో పదవీ విరమణ చేసిన వేలాది మంది కార్మిక కుటుంబాలు గూడు లేక ఇప్పటికీ అద్దె ఇండ్లలోనే ఉంటున్నారు.

ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌లకు సన్మానం

కథలాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా నియమితులైన ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్‌లను మంగళవారం సెర్ప్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సంఘ సభ్యులు, అధికారులు సన్మానిం చారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. డీపీఎం (ఎల్‌హెచ్) మల్లేశం, డీపీఎం (ఐబీ) విజయభారతి, ఏపీఎం నరహరి, సీసీలు తెడ్డు అంజయ్య, విజయనిర్మల, అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో రేపు సమావేశం

మల్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల చేపట్టిన వార్డుల వారి ఓటర్ల ప్రకారం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల వివరాల జాబితా ప్రచురించగా అభ్యంత రాలపై గురువారం రాజకీయ పార్టీలనే తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండలంలోని అన్నీ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, హాజరు కావాలని కోరారు.

ట్రస్మా కార్యవర్గం ఎన్నిక

మల్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ట్రస్మా మండల స్థాయి కార్యవర్గంను సోమవారం మల్యాలలో ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా ప్రతాప్ కిషన్‌రావు, గౌరవ అధ్యక్షులుగా విశ్వనాల దయానంద్, సాయిరాం, అధ్యక్షుడిగా ఎనుగందుల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా కె.కె.విజయన్, కోశాధికారిగా అనిల్‌కుమార్, సభ్యులుగా నరేశ్‌కుమార్, మహేశ్, తిరుపతి ఎన్నికయ్యారు

విద్యార్థులను అభినందించిన వాకర్స్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) మంచిర్యాల జిల్లా లక్షెటిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వాకర్స్ సభ్యులు మంగళవారం అభినందించారు. జగిత్యాలకు చెందిన మనస్ కుమార్, బుర్ర కనిష్క్, మన్విత, వీర కుంగ్‌ఫూ అకాడమీ ట్రైనర్ వెంకటేశ్వర్లు, రాజులను వాకర్స్ అసోషియేషన్ సభ్యులు సన్మానించారు. కౌన్సిలర్లు నవీన్, గౌతంరెడ్డి ఉన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు..

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి

సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

పెగడపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను గౌతం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన, జండావిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంఈవో సులోచన, నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం మంగళవారం సీఎం కప్పు ఆటల పోటీలను మున్సిపల్, మండల స్థాయి అధికారులు, నాయకులు ప్రారంభిం చారు. క్రీడ పోటీలను మున్సిపల్ వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, కమిషనర్ తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నం అనిల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, మండల విద్యాధికారి నరేశంలు ప్రారంభించారు.

కథలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడలను ఎంపీడీవో శంకర్, ఎస్సై నవీన్ ప్రారంభించారు. కబడ్డీల్లో మొదటి స్థానం పెగ్గెర్ల, ద్వితీయ స్థానం చింతకుంట, ఖోఖోలో మొదటి స్థానం కథలాపూర్, ద్వితీయ స్థానం అంబారిపేట, వాలీబాల్ విభాగంలో మొదటి స్థానం ఊట్‌పల్లి, ద్వితీయ స్థాన అంబారిపేట, ఖోఖో, కబడ్డీ బాలికల విభాగంలో భూషణరావుపేట, గంభీర్‌పూర్ వరుసగా విజేతలుగా నిలిచారని ఫిజికల్ డైరెక్టర్ రవీందర్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరందీప్, ఉపాధ్యాయులు ఉన్నారు.



కోరుట్లలో సీఎం క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

మల్యాల: సీఎం కప్ మండల స్థాయి పోటీలకు మల్యాలలోని బాలుర పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు ఎంపిక అయినట్లు హెచ్.ఎం.అనుపమ, పీడీ విశ్వప్రసాద్ తెలిపారు. నేటి నుంచి రెండు రోజుల పాటు తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో బాలుర ఖోఖో, వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

కొడిమ్యాల : మండల స్థాయి క్రీడలు తహసీల్దార్ రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో స్వరూప, ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బూట్ల రాజమల్లయ్య పాల్గొన్నార

రాయికల్: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో సియం కప్ క్రీడలను మంగళవారం చైర్మన్ ప్రారంభించారు. వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కమీషనర్ జగదీశ్వర్‌గౌడ్, ఎంఈవో రాఘవులు, మేనేజర్ వెంకటి పాల్గొన్నారు.

● మండలంలోని భూపతిపూర్ గ్రామంలో మండల స్థాయి సియం కప్ క్రీడలను ఎంపీడీవో చిరంజీవి ప్రారంభించారు. తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మ, పీఆర్ఏఈ ప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

● ఎస్ఎస్ఏ జేఏసీ డిమాండ్ ● పట్టణంలో ర్యాలీ- అంబేద్కర్ విగ్రహానికి వినతి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అనుబంధ విభాగమైన సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ సంఘ బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించి, తహశీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు మినిమం స్కేల్ కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగికి రూ. 20లక్షల జీవిత బీమా, రూ.10లక్షల ఆరోగ్య బీమా కల్పించడంతో పాటు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పదవీవిరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ. 25లక్షలు ఇవ్వాలన్నారు. పై డిమాండ్‌లతో గతంలో నిర్వహించిన ధర్నా పాయింట్ వద్ద అప్పటి పీసీసీ, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సంఘీభావం తెలిపి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిమాండ్‌లు నెరవేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. వంద రోజుల్లో హామిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిన నేటికీ అమలు కాలేదన్నారు. హామీని నిలబెట్టుకోవాలని వారు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ బాధ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిని వినియోగించి జీవితం నాశనం చేసుకోవద్దని మెట్‌పల్లి సిఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం వారిచే మూఢ నమ్మకాలు, ఆత్మహత్య నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, సీసీ కెమెరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లు అలవర్చుకోని ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం..

(5వ పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా 3,512 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఆయా మండ లాల్లో 5,99,487 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2,85,791 మంది, మహిళలు 3,13,682 మంది, ఇతరులు 14 మంది ఉన్నారు. 200 లోపు ఓటర్లు ఉన్న పంచాయ తీలలో 2,341 పోలింగ్ కేంద్రాలు, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న కేంద్రాలు 1,113 కాగా, 401 నుంచి 650 మంది వరకు ఓటర్లు ఉన్న కేంద్రాలు 58 వరకు ఏర్పాటు చేయనున్నారు.

● అందుబాటులో ఎన్నికల సామగ్రి...

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత బ్యాలెట్ పత్రాలు ముద్రించాలి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ల వివరాలను పంచాయతీ అధికారులు సేకరించారు. కరీంనగర్‌కు చెందిన ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో బ్యాలెట్ పేపర్లు ముద్రించడానికి ప్రాథమికంగా నిర్ణయించారు. వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉంచిన సుమారు 5 వేల బ్యాలెట్ పెట్టెలను జిల్లా కేంద్రానికి తెప్పించి మరమ్మతులు చేయించారు. జగిత్యాలలో ఉన్న బ్యాలెట్ పెట్టెల నుంచి సుమారు 700 బాక్స్‌ల వరకు జనగామా జిల్లాకు తర లించారు. రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్ఓ), రూట్ అధికారులకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని ఇప్పటికే కార్యాల యాల్లో ఉంచారు. జంబో బ్యాలెట్ బాక్కులను మాత్రమే విని యోగించాలన్న ఆలోచనతో అధికారులున్నారు. సుమారు పది టన్నుల బ్యాలెట్ పేపర్‌ను హైద్రాబాద్ నుంచి జగిత్యాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. పేపర్‌ను బ్యాలెట్‌ల ముద్రణకు నోటిఫికేషన్ అనంతరం కరీంనగర్‌కు తరలించడానికి నిర్ణయించారు. నోటిఫికేషన్ రాగానే ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు.

● ఆదేశాలు రాగానే ఎన్నికల నిర్వహిస్తాం

గౌతమ్ రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశాలిచ్చినా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సిబ్బంది శిక్షణ, ఇప్పటికే సరఫరా చేయాల్సిన సామగ్రిని సంబంధిత కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాం. జిల్లా కార్యాలయంలోనూ ఎన్నికల సామగ్రి సిద్ధంగా ఉంది. బ్యాలెట్ పెట్టెలను సరిచేశాం. బ్యాలెట్ పే పర్ల ముద్రణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాము. సుమారు పది వేల టన్నుల బ్యాలెట్ పేపర్‌ను రాజదాని నుంచి తెప్పిస్తున్నాము. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు తుది జాబితాను ఈనెల 17వ తేదీన ప్రకటించనున్నాము.

డీఈవోను కలిసిన ఉత్తమ ఉపాధ్యాయులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల జగిత్యాల జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రామును జిల్లా అవార్డీ టీచర్స్ అసోసియేషన్(ఆటా) ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించి, మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ బాధ్యులు బోయినిపెల్లి ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి, ఆటా జిల్లా ప్రధాన కార్యదర్శి జూపాక సుదర్శన్, సభ్యులు కొండపల్కుల నర్సింగరావు, అందె నారాయణ, కడకుంట్ల అభయ్‌రాజ్ తదితరులున్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన టిఎన్‌జీవోలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) ఇటీవల ఎన్నికైన టిఎన్‌జీవో కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డిని కలిశారు. టీఎన్‌జీవో అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి, ఆయనకు పుష్పగుచ్చం అందించారు. అదనపు కలెక్టర్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

పన్నుల వసూళ్లలో లక్ష్యం సాధించాలి

అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి

పెగడపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పరిధిలో పన్నులు వసూళ్లలో వంద శాతం లక్ష్యం సాధించాలని స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెగడపల్లి గ్రామ పంచాయతీని మంగళవారం అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. పన్నుల వసూల్లు, తాగు నీటి సరఫరా పారిశుధ్య పనులలో అలసత్వం వహించకూడదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, ఉపాధిహామీ పనుల పట్ల దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పీటీసీ స్వామి ఉన్నారు.



గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● జిల్లా విద్యాధికారి రాము

కథలాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా అందించాలని జిల్లా విద్యాధికారి రాము నిర్వాహకులు, అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటలు చేసేలా చూడాలని ఎప్పటికప్పుడు మండల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్వాహకులకు తగు సూచనలు అందిస్తే ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటుందని చెప్పారు. అదేవిధంగా పదవ తరగతి రెండో పరీక్షా కేంద్రంకు పాఠశాల అనువైన ప్రదేశంగా ఉంటుందా అనే అంశాలను పరిశీలించారు. సుమారు వంద మంది విద్యార్థులకు సరిపడే వసతులు ఇక్కడ ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం దరందీప్, ఉపాధ్యాయులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనం వంటను పరిశీలిస్తున్న డీఈవో రాము

అందుబాటులో ఆరోగ్య సేవలు

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అత్యవసర సమయంలో మరింత అందుబాటులోకి ఆరోగ్య సేవలను విస్తరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. ప్రభుత్వం కొడిమ్యాల మండలానికి నూతనంగా కేటాయించిన అంబులెన్స్ వాహనాన్ని మంగళవారం మండలంలోని పూడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, ఎంపీడీవో స్వరూప, సీహెచ్‌వో రాజశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సిం గరావు, వ్యవసాయమార్కెట్ వైస్ ఛైర్మన్ జీవన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ముత్యం శంకర్ ఉన్నారు.

20న నల్లగొండలో బహిరంగ వేలం

కొడిమ్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ పరిధిలో పట్టినామాలు కోరమీసాలు అమ్ముకునే హక్కు పొందుటకు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కుల కోసం ఈ నెల 20న ఆలయ కార్యాలయంలో బహిరంగ వేలం పాట, సీల్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న మంగళవారం తెలిపారు. పట్టి నామాలు కోరమీసాలు అమ్ముకునే హక్కుల కోసం లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కుల కోసం టెండర్‌లో పాల్గొనటానికి 30వేల రూపాయలు డిపాజిట్ కార్యాలయంలో చెల్లించాలన్నారు. ఫిబ్రవరి 7, 2025 నుంచి ఫిబ్రవరి 13, 2025 వరకు కాలపరిమితి ఉందన్నారు. వాహన పార్కింగుకు 2 లక్షల రూపాయల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. కాల పరిమితి ఫిబ్రవరి 7, 2025 నుండి ఫిబ్రవరి 6, 2027 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని ఈవో కోరారు.

పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) :పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందాని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం కోరుట్ల మండలం యూసఫ్‌నగర్ గ్రామానికి చెందిన పంజాల నర్సాగౌడ్‌కు 1.50 లక్షల ఓల్‌వోసీ చెక్కు మంజూరు కాగ జువ్వాడి భవన్‌లో నర్సాగౌడ్‌కు అందజేశారు. జిల్లా గ్రంథలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిల సురేష్‌గౌడ్, లింబాద్రి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమవుతుందని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం బండలింగాపూర్ గ్రామంలోని అభివృద్ధి పనులకు సీడీఎఫ్ నుంచి రూ. 20లక్షల నిధులు మంజూరు చేయించిన ప్రొసిడింగ్స్ పత్రాలను అందజేసినంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాలకు ..

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తల్లికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అవమాన పరిచాడని ఆరోపిస్తూ మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేసారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సింగిల్ విండో చైర్మన్లు భూమయ్య, నర్సరెడ్డి, మాజీ ఎంపీపీ తోట నారాయణ పాల్గొన్నారు.

ధర్మపురి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తలు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రాజేష్, కౌన్సిలర్లు వేణుగోపాల్, అశోక్, సయ్యద్ యూనస్, సుధాకర్, విజయలక్ష్మి-లక్ష్మణ్, పాల్గొన్నారు.

కొడిమ్యాల : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. మండలంలోని నమిలికొండలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నాయకులు లింగాగౌడ్, రమేష్, చంద్రమొహన్, ఆదయ్య, స్వామి, నరేష్ ఉన్నారు.

రాయికల్: పట్టణంలోని తెలంగాణా తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఎలిగేటి అనీల్, బక్కం మల్లేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ మండల నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, కరుణాకర్ రావు, బొమ్మెన స్వామి, ఉప్పులంచ లక్ష్మణ్, పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మండల బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. జనగాం శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దశరథం, చిన్న దుర్గయ్య పాల్గొన్నారు

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చిత్ర పటానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రమేష్, యూత్ అధ్యక్షులు రవీందర్ పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల క్రేందంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండల బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ కొల్మల రమణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సుమన్, మాజీ సింగిల్‌బవిండో అధ్యక్షులు రాజేశం, మాజీ సర్పంచ్ చిక్రం రవీందర్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని రేచపల్లి గ్రామంలో గల తెలంగాణ తల్లి విగ్రహనికి క్షారాభిషేకం చేసి నినాదాలు చేశారు. ఉద్యమ కారులు కొండ ప్రభాకర్, భైరి మల్లేశం, ఎండబెట్ల ప్రసాద్ పాల్గొన్నారు.



కొడిమ్యాల, రాయికల్‌లో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'వార్డు సమస్యలు పరిష్కరించండి'

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని రెండవ వార్డులో నెలకొన్న సమస్యలపై బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ మంగళవా రం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. పట్టణంలోని దేవాలయం నుంచి బ్రాహ్మణ సంఘం వరకు మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వకాలు చేపట్టి ఆ రోడ్డును తిరిగి మరమ్మతు చేయలేదన్నారు. మరమ్మతు చేయించి కొత్త రోడ్డు వేయించాలని కోరారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం

గొల్లపెల్లి, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) గొల్లపెల్లి మండల కేంద్రంలో సీఎం కప్ ఆటల పోటీలను మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ కుమార్ మంగళవారం ప్రారంబించారు. స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రారంబం అయిన ఈ పోటీలలో ఎపిడిఓ రాంరెడ్డి, ఎంఈవో జమున దేవి, ఎస్. సతీష్, రాజెంద్ర కుమార్, అనిత, పిడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్త హీనతను నివారించాలి

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో రక్త హీనత ద్వారా శారీరక రుగ్మతకు గురవుతారని, వాటిని నివారించినపుడే బలిష్ఠమైన శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుందని ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డాక్టర్ గూడూర్ హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం రక్త పరీక్షలు, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారాన్ని, సీజనల్ పండ్లు తీసుకోవడం ద్వారా రక్త హీనత నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని మొత్తం 203 మంది విద్యార్థులకు అనిమియా రక్త పరీక్షలు నిర్వహించగా, 52 మంది విద్యార్థులకు రక్త హీనత ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలలోని 141 మంది విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీని అందించారు. ఐఎంఏ జగిత్యాల కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్‌కుమార్, వైద్యులు శిరీషరెడ్డి, అంకం లక్ష్మణ్, ప్రశాంత్, మాజీ సర్పంచ్ రంగు మమత- అశోక్, బుచ్చన్న, రత్నాకర్, హెచ్‌ఎంలు రావులపెల్లి వెంకటరమణ, సాధు శ్రీకాంత్, టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థినికి డిక్షనరీ ఇస్తున్న వైద్యురాలు

సంక్షిప్త సమాచారం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల స్థాయి సీఎంకప్ క్రీడాపోటీలు జిల్లా కేంద్రంలోని వివేకనందస్టేడియంలో బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఈనెల 11 నాడు బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 12 నాడు బాలురకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, 13 నాడు బాలురు, బాలికలకు సంబంధించిన అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

కొడిమ్యాల: కోర్టు ఉత్తర్వులతో సాగు చేసుకుంటున్న భూమిలో కొడిమ్యాల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన సావనపెల్లి శ్రీనివాస్ కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పోలీస్ స్టేషన్‌లో కోర్టు ఉత్తర్వుల కాపిని అందించినట్లు బాధితుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమి అని ఫ్లెక్సీ ఏర్పాటు చేసింది నిజమేనన్నారు.

● మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో బాగంగా కూరగాయల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శాస్త్ర వేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలోఏవో జ్యోతి, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, పూడూర్ మాజీ సర్పంచు రాంరెడ్డి, ఏఈవోలు గ్రీష్మ, రాజేష్, శ్రీలత, ప్రశాంత్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండలం రాపల్లె తాజామాజీ సర్పంచ్ నల్ల శ్యామ్ ఇటీవల డిక్కీ (దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) జిల్లా కో-ఆర్డీనేటర్‌గా నియమితులైన సందర్భంను పురస్కరించుకుని గొల్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు బొల్లం రమేష్, యూత్ అధ్యక్షుడు చెవుల రవీందర్, తాజామాజీ ప్రజా ప్రతినిధులు హన్మాండ్లు, శంకరయ్య పాల్గొన్నారు.

మల్లాపూర్ : నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ విద్యాలయాన్ని మల్లాపూర్‌లో ఏర్పాటు చేయాలని సాధన కమిటీ నాయకులు కోరారు. మంగళవారం తహసీల్దార్ వీర్‌సింగ్‌కు సాధన కమిటీ నాయకులు వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వెల్గటూర్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య వినతి పత్రం సమర్పించారు.